ప్రాజెక్టుల నీటిమట్టం

| ప్రాజెక్టు | పూర్తిస్థాయి | ప్రస్తుతం | ఇన్‌ఫ్లో | అవుట్‌ఫ్లో |
|---|---|---|---|---|
| | నీటి మట్టం (అడుగులు) | | (క్యూసెక్కులు) | |
| సాగర్ (టీఎంసీలు) | 590 (312.0450) | 585.80 (299.7430) | 1,88,938 | 1,88,938 |
| మూసీ (టీఎంసీలు) | 645 (4.46) | 643.75 (4.13) | 2,530.24 | 2,679.72 |
| పులిచింతల (టీఎంసీలు) | 175 (45.77) | 169.6174 (37.8181) | 1,79,000 | 1,76,000 |

చికెన్ ధరలు | లైవ్ : రూ.135 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220



భారీ వర్షాలకు పోచంపల్లి మండలం భట్టుగూడెంలో దెబ్బతిన్న రహదారి

# రూ.10కోట్లు

## భారీ వర్షాల నష్టం

- 17 ఎకరాల్లో పూర్తిగా నీట మునిగిన వరి
- కొట్టుకుపోయిన చెరువులు, కల్వర్టులు
- శాఖల వారీగా దెబ్బతిన్న వాటిపై అంచనాలు
- వరదల్లో గల్లంతై నలుగురు మృతి
- ఒక్కో కుటుంబానికి రూ.5లక్షల పరిహారం

**భారీ వర్షాలతో జిల్లాలో భారీగా పంట నష్టం వాటిల్లింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు నష్టం అంచనాలు రూపొందించి నివేదించారు. అధికారుల అంచనా మేరకు రూ.10కోట్ల నష్టం వాటిల్లింది. వర్షాలకు పంటలతోపాటు రోడ్లు, చెరువులు, కల్వర్టులు, ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లింది. దీంతో తక్షణ సహాయం కింద ఆయా జిల్లాలకు రూ.200కోట్లు మంజూరు చేసింది.**

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో దాదాపు రూ.10కోట్ల మేరనష్టం వాటిల్లింది. నష్టపోయిన పంటల కు ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీని మంజూరు చేయనుంది. జిల్లాలోని బీబీనగర్, భువనగిరి, వలిగొండ మండలాల్లో వరిపంట నేలకొరింది. అయితే పంట మొత్తం నష్టపోయింది 18ఎకరాలుగా అధికారులు తేల్చారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.10 వేలు (ఇన్‌పుట్ సబ్సిడీ) పరిహారం అందించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో అన్నిశాఖల పరిధిలో జరిగిన నష్టంపై అంచనాలు రూపొందించి సంబంధిత శాఖలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాయి. భారీ వర్షాలకు మూసీ వరదలో కొట్టుకుపోయిన నలుగురు గల్లంతై మృతి చెందారు. వీరిలో మోత్కూరు మండలానికి చెందిన ఒకరు, బొమ్మలరామారం మండలంలో ఒకరు, భువనగిరి మండలంలో ఇద్దరు మృతి చెందారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5లక్షల పరిహారాన్ని మంజూరు చేసింది. వీరికి సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో నామినీల పేర జమ చేసేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

### కొట్టుకుపోయిన చెరువులు, కల్వర్టులు

భారీ వర్షాలకు జిల్లాలోని పలు మండలాల్లోని చెరువులు, కుంటలు, కల్వర్టులు, రోడ్లు కొట్టుకుపోయాయి. రోడ్లు, భవనాల శాఖ పరిధిలో 21 ప్రాంతాల్లో 4.25 కిలోమీటర్ల వరకు రోడ్లు దెబ్బతిన్నాయి. 30 మీటర్ల వరకు పూర్తిగా దెబ్బతినగా, తొమ్మిది కల్వర్టులు కొట్టుకుపోయాయి. తాత్కాలిక మరమ్మతుల కింద రూ.40లక్షలు, శాశ్వతంగా రోడ్లు బాగు చేసేందుకు రూ.2.18కోట్ల

- మిగతా 8వ పేజీలో...

# సర్వర్ బిజీ

- ఉపాధ్యాయులకు ఎఫ్ఆర్ఎస్ కష్టాలు
- ఆలస్యానికి చెల్లుచీటీ
- ఇప్పటికే విద్యార్థులకు ఎఫ్ఆర్ఎస్ అమలు




సంస్థాన్ నారాయణపురంలో ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరును నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయుడు

విద్యాశాఖలో ఇప్పటికే విద్యార్థులకు అమలుచేస్తున్న ఫేషియల్ రికగ్నేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ఉపాధ్యాయులకూ అమలులోకి వచ్చింది. ఉపాధ్యాయులు సక్రమంగా పాఠశాలలకు హాజరయ్యేలా ఈ విధానాన్ని అమలుచేస్తుండగా, టీచర్ల ఆలస్యపు హాజరుకు చెల్లుచీటీ పడుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయితే ఉదయం 9.05గంటలకే ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో హాజరు నమోదు చేయాల్సి ఉండగా, ఉపాధ్యాయులు ఉరుకులు పరుగులతో పాఠశాలలకు చేరుకుంటున్నారు. అంతా ఒకేసారి యాప్ వినియోగిస్తుండటంతో సర్వర్ బిజీతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ యాప్‌లో లొకేషన్, ఇంటర్నెట్ ఆధారంగా హాజరు నమోదవుతుండటంతో కనెక్టివిటీ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మంగళవారం 'ఆంధ్రజ్యోతి' బృందం క్షేత్రస్థాయిలో పరిశీలన చేయగా, ఈ యాప్‌తో ఇబ్బందులు, ప్రయోజనాలు వెలుగుచూశాయి.

● **భువనగిరి టౌన్** ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 18 మంది ఉపాధ్యాయులకు ఒక రు డిప్యూటేషన్‌పై వెళ్లగా 12 మంది ఉదయం 9.05గంటలలోపు పాఠశాలకు చేరుకొని ఎఫ్ఆర్ఎస్‌లో హాజరును నమోదు చేశారు. ఐదుగురు సెలవులపై అన్నారు. ఇక్కడ కొద్దిసేపు కనెక్టివిటీ ఇబ్బందులు ఎదురయ్యాయి.

● **రాజాపేట** మండలం పారుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ఇద్దరు సెలవులో ఉండగా మిగతావారు సకాలంలో హాజరు నమోదుచేశారు. ఇక్కడ సెల్ సిగ్నల్స్ సరిగా లేకపోవడంతో ఉపాధ్యాయులు సిగ్నల్ కోసం పాఠశాల ఆవరణ మొత్తం తిరగాల్సి వచ్చింది.

● **మోటకొండూరు** మండలంలోని ముత్తిరెడ్డిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

- మిగతా 8వ పేజీలో...

# పంచాయతీ ఓటర్లు 5.32లక్షల మంది

- తుది జాబితాను విడుదల చేసిన ఎన్నికల సంఘం
- వార్డుల వారీగా ఓటర్ల విభజన



యాదాద్రి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా ఎన్నికల సంఘం మంగళవారం ఓటర్ల తుది జాబితాను ప్రకటించింది. జిల్లాలో మొత్తం 5,32,240 మంది ఓటర్లుగా తేల్చింది. వీటిలో పురుషులు 2,67,577మంది,మహిళలు 2,67,661మంది, ఇతరులు ఇద్దరు ఓటర్లు ఉన్నారు. తుది ఓటర్ల జాబితాకు ముందుగా జిల్లాలో మొత్తం 5,32,218మంది ఓటర్లు ఉన్నారు. తుది జాబితాలో అదనంగా 22మంది ఓటర్లు పెరిగారు.

జిల్లాలోని చాలా మండలాల్లో ఓటర్ల జాబితాలో ఎలాంటి మార్పులు చోటుచేసుకోలేదు. కొన్ని మండలాల్లో మాత్రమే ఓటర్లు పెరిగారు. గ్రామీణ ప్రాంతాల్లోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్ల జాబితాను అధికారులు సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా 427 గ్రామపంచాయతీల పరిధిలో 3,704 వార్డులు ఉన్నాయి. మొత్తం 3,704పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎన్నికల సంఘం ఇటీవల గ్రామపంచాయతీల్లో ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఆగస్టు 28న పంచాయతీలు, వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. ఆగస్టు 29న జిల్లా స్థాయి, 30న మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాన్ని నిర్వహించింది. ఆగస్టు 28 నుంచి 30 వరకు ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలను స్వీకరించింది. వాటిని పరిష్కరించి మంగళవారం తుది ఓటర్ల జాబితాను ప్రకటించింది. తుది ఓటర్ల జాబితా సిద్ధం కావడంతో ఇక స్థానికసంస్థల ఎన్నికల నోటిఫికేషనే తరువాయి.

**ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా**

ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం తుది ఓటర్ల జాబితాను ప్రకటించాం. జిల్లాలో మొత్తం 427 గ్రామ పంచాయతీలు, 3,704వార్డులు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్లు 3,704, పోలింగ్ లొకేషన్లు 504 ఉన్నాయి. ఎన్నికల సంఘంతో పాటు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం.

- విష్ణువర్ధన్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో, ఇన్‌చార్జి డీపీవో

| మండలం | గ్రామాలు | వార్డులు | ఓటర్లు |
|---|---|---|---|
| అడ్డగూడూరు | 17 | 150 | 23,022 |
| ఆలేరు | 16 | 140 | 21,537 |
| ఆత్మకూరు (ఎం) | 23 | 192 | 25,533 |
| పోచంపల్లి | 21 | 192 | 27,497 |
| భువనగిరి | 34 | 294 | 39,654 |
| బీబీనగర్ | 34 | 284 | 42,876 |
| బొమ్మలరామారం | 35 | 284 | 29,503 |
| చౌటుప్పల్ | 26 | 236 | 38,501 |
| గుండాల | 20 | 182 | 26,069 |
| మోటకొండూరు | 20 | 170 | 21,103 |
| మోత్కూరు | 10 | 88 | 13,215 |
| నారాయణపూర్ | 31 | 260 | 40,113 |
| రాజపేట | 23 | 206 | 30,236 |
| రామన్నపేట | 24 | 232 | 45,358 |
| తుర్కపల్లి | 33 | 266 | 27,977 |
| వలిగొండ | 37 | 330 | 52,431 |
| యాదగిరిగుట్ట | 23 | 198 | 27,615 |
| మొత్తం | 427 | 3704 | 5,32,240 |

# నవరాత్రి వేడుకల్లో సమాజ ఐక్యత

కలెక్టర్ హనుమంతరావు



గణేష్ నవరాత్రుల పూజల్లో పాల్గొన్న కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్

భువనగిరి టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి):గణేష్ నవరాత్రి ఉత్సవాలు సమాజ ఐక్యతకు దోహదపడతాయని కలెక్టర్ ఎం.హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్‌యాదవ్ అన్నారు. భువనగిరిలోని కిసాన్‌నగర్ యూత్ మండపంలో మంగళవారం గణేష్ నవరాత్రి పూజలు చేసి అన్నదానం ప్రారంభించి మాట్లాడారు. దేశ స్వాతంత్ర ఉద్యమం బలోపేతానికి బాలగంగాధర్ తిలక్ ప్రారంభించిన నవరాత్రి ఉత్సవాల స్పూర్తితో నేటితరం సమాజంలోని రుగ్మతలపై పోరాడాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా దైవభక్తి, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ అవేజ్‌చిస్తి, మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం, పట్టణ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్, నిర్వాహకులు భాషబోయిన రాజేష్, చందా మహేందర్‌గుప్తా, కోళ్ల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావు పెద్ద చెరువును సందర్శించి పట్టణంలో ప్రతిష్ఠించిన విగ్రహాలన్నింటిని ఒకే రోజున ఐదో తేదీన నిమజ్జనం చేయాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట డీఈ కొండల్‌రావు తదితర అధికారులు ఉన్నారు.

### పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

భువనగిరి రూరల్: వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి పేదలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని అనాజీపురం పల్లె దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాల వివరాలను, దోమలు ప్రబలకుండా తీసుకుంటున్న చర్యలపై పంచాయతీ కార్యదర్శి స్వాతిని అడిగి తెలుసుకున్నారు.

### ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలి

వలిగొండ, బొమ్మలరామారం, రామన్నపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. మంగళవారం వలిగొండ మండలంలోని మందాపురం గ్రామంలో, బొమ్మలరామారం మండలంలోని మేడిపల్లి, మైలారం, మైసిరెడ్డిపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలను, పల్లె దవాఖాన, ఇందిరమ్మ ఇళ్ల పనులను, రామన్నపేట ఎస్సీ కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. బేస్‌మెంట్ లెవల్ నిర్మించుకున్న వారి ఖాతాలో డబ్బు జమ అయ్యాయా? అని అడిగారు. గోడల నిర్మాణం కూడా త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. దసరా వరకు గృహప్రవేశం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. మేడిపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పర్యవేక్షణ సరిగా లేకపోవడంతో ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని డీఈవోను ఆదేశించారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

# 'దళితబంధు' నిధులు విడుదల చేయాలి




మోత్కూరులో రాస్తారోకో చేస్తున్న దళిత బంధు లబ్ధిదారులు

### అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం

మోత్కూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో రెండో విడత దళితబంధు మంజూరైన లబ్ధిదారులకు నిధులు విడుదల చేసేలా ప్రభుత్వ పెద్దలకు జ్ఞానం కలిగించాలని కోరుతూ మంగళవారం దళితబంధు లబ్ధిదారులు మోత్కూరులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా చెడిపల్లి రఘుపతి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మోత్కూరు, అడ్డగూడూరు మండలాల్లో 254 మందిని దళితబంధు పథకంలో రెండో విడత లబ్ధిదారులుగా ఎంపిక చేసి ఒక్కొక్కరి బ్యాంకు ఖాతాలో రూ.3 లక్షలు జమ చేశారన్నారు. అంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు సీజ్‌చేసి, మిగతా డబ్బులు వేయలేదన్నారు. ఈ ఏడాది జనవరిలో ఫ్రీజింగ్ తొలగించి లబ్ధిదారులకు యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసినా ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు యూనిట్లు గ్రౌండింగ్ చేయడంలేదని ఆరోపించారు. తమకు మిగతా డబ్బులు విడుదలచేసి యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని కోరుతూ ఎమ్మెల్యే సామేలు, కలెక్టర్ హనుమంతరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీలకు పలుమార్లు వినతి పత్రాలు ఇచ్చినా కనీస స్పందన లేదన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి నియోజకవర్గాల్లో రెండో విడత దళితబంధుకు నిధులు విడుదల చేసి, ఇక్కడ చేయకపోవడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయి నిధులు విడుదల చేసి, యూనిట్లు గ్రౌండింగ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కూరెల్ల రమేష్, రుద్రవెల్లి గణేష్, దాసరి నరేష్, జిల్లా శివాజీ, అంజనేయులు, మహేందర్, కొంపల్లి రమేష్, కడియం స్వామి, శ్రీకాంత్, పరశురాములు, కిరణ్, సందీప్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# వసతిగృహాల్లో పరిశుభ్రత పాటించాలి

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కరరావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కరరావు

భువనగిరి (కలెక్టరేట్), సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహ విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనంతో మెరుగైన విద్యా బోధన అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కరరావు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ జిల్లా సంక్షేమాధికారుల, వసతి గృహాల ప్రిన్సిపాళ్ల, హెచ్‌డబ్ల్యూవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ వసతిగృహాల్లో చదివే విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దే బాధ్యత అందరిపై ఉందని, వారి చదువు, భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంతోపాటు విద్యార్థుల ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలన్నారు. వసతి గృహాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆహార తనిఖీ అధికారి స్వాతి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో డీఈవో కే.సత్యనారాయణ, జిల్లా మైనారిటీ, బీసీ సంక్షేమాధికారి సాహితి, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి శ్యాంసుందర్, ఎస్టీ సంక్షేమాధికారి నాగిరెడ్డి పాల్గొన్నారు.

### సకాలంలో పనులను పూర్తి చేయాలి

ఉపాధిహామీ పథకంలో గుర్తించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) భాస్కరరావు అన్నారు. ఉపాధి నిధులతో చేపడుతున్న పనుల ప్రగతిపై కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఉపాధి నిధులతో పంచాయతీరాజ్ విభాగం చేపడుతున్న గ్రామ పంచాయతీ అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలల ప్రహరీల నిర్మాణాలను డిసెంబరు నెలాఖరు వరకు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, డీఆర్డీవో నాగిరెడ్డి, పీఆర్ ఈఈ బాలచందర్, అదనపు డీఆర్డీవో సురేష్, ఎంపీడీవోలు, పీఆర్ ఏఈలు, ఎంపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలకు సర్వేనే కీలకం

ఏడీఏ శాంతి నిర్మల



సైదాపురం గ్రామంలో డిజిటల్ సర్వేను పరిశీలిస్తున్న ఏడీఏ శాంతినిర్మల

యాదగిరిగుట్ట రూరల్,సెప్టెంబరు 2, (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు డిజిటల్ సర్వేనే కీలకమని యాదగిరిగుట్ట డివిజన్ ఏడీఏ శాంతినిర్మల అన్నారు. మంగళవారం మండలంలోని సైదాపురం గ్రామంలో ఏఈవోలు చేపడుతున్న సర్వేను పరిశీలించారు. డిజిటల్ సర్వే ఆగస్టు 26 నుంచి ప్రారంభమైందని, రైతులు తమ వ్యవసాయ భూముల్లో సాగుచేసిన పంటల వివరాలు, ఏఈవోలు సాంకేతిక పద్ధతుల్లో నమోదు చేయడంతో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయన్నారు. వ్యవసాయ శాఖ డేటా ఆధారంగా ఇతర ప్రభుత్వ పథకాల అమలులో డిజిటల్ సర్వే కీలకపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఏవో సుధారాణి, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

# సీబీఐకి అప్పగించినా కేసీఆర్‌కు నష్టం లేదు



గుట్టలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సునీత, నాయకులు

గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ రిపోర్టు అధ్వానంగా ఉందని, ఆ కేసును సీబీఐకి అప్పగించినా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు నష్టం లేదని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ రిపోర్టును సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ మంగళవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గుట్ట పట్టణ బస్టాండ్ ఎదుట సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాళేశ్వరం కమిషన్ రిపోర్టును సీబీఐకి అప్పగించడం వల్ల కేసీఆర్‌కు నష్టమేమీ లేదన్నారు. ఆయన చేసిన మంచిపనులే బయటకు తీసుకొస్తాయన్నారు. కాళేశ్వరంపై సీఎం రేవంత్‌రెడ్డి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఆరోపించారు.జిల్లాలో ఇద్దరు డమ్మీ మంత్రులున్నారని, వారు కనీసం జిల్లా అభివృద్ధిని పట్టించుకోవడం లేదన్నారు. భువనగిరి మండలంలోని బస్వాపురం రిజర్వాయర్ భూనిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.50కోట్లు ఇస్తే ఈ ప్రభుత్వం రూ.30కోట్లు బాధితులకు అందజేసి రూ.20కోట్లను వెనక్కి తీసుకుందని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌ను బదన్నాం చేయడం మానుకొని ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి రాష్ట్ర అభివృద్ధికి ఆలోచించాలని హితవు పలికారు. తొలుత పట్టణంలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేశారు. బీఆర్ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేయడానికి ప్రయత్నిస్తుండగా స్థానిక పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కార్యక్రమంలో పార్టీ యాదగిరిగుట్ట మండల అధ్యక్ష, కార్యదర్శులు కర్రె వెంకటయ్య, కాసావు శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మిడి రాంరెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనురాధబీరయ్య, పట్టణ అధ్యక్షుడు పాపట్ల నరహరి, మాజీ కౌన్సిలర్లు బూడిద సురేందర్, ఆవుల మమతసాయి, తాళ్లపల్లి నాగరాజు, చంద్రగాని జహంగీర్‌గౌడ్, రేపాక స్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.




# వాట్సాప్‌లో ఆర్టీసీ టికెట్ బుకింగ్

● హైదరాబాద్‌లోని మియాపూర్, కంటోన్మెంట్ డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా పనితీరు పరిశీలన
● త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలుకు యత్నాలు




**ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్పులకు శ్రీకారం చుడుతున్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మరో కొత్త విధానం అమల్లోకి తెచ్చింది. వాట్సాప్ ద్వారా టికెట్ బుకింగ్ చేసుకోవడానికి అవకాశం కల్పిస్తోంది. ప్రయాణికులు తమ వివరాలను వాట్సాప్‌లో నమోదుచేసి, ఈ-టికెట్ పొందేందుకు వీలుగా సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసింది. ఈ విధానంలో ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్(ఏఎఫ్‌సీఎస్)తో ప్రయాణికులు వేగంగా టికెట్ పొందవచ్చు. డిజిటల్(యూపీఐ) చెల్లింపులను ఇప్పటికే స్వీకరిస్తున్న ఆర్టీసీ వాట్సాప్ ద్వారా టికెట్ బుకింగ్ విధానం అమలుపై ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.**

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

ఆర్టీసీ యాజమాన్యం వాట్సాప్ ద్వారా బస్ టికెట్ల జారీని ప్రయోగాత్మకంగా అమలుచేస్తోంది. హైదరాబాద్‌లోని రెండు డిపోలలో ఈ విధానాన్ని అమలుచేస్తున్నారు. ప్రయాణికులు ఆర్టీసీ సంస్థ ప్రకటించిన మొబైల్ నెంబరుకు 'హాయ్' అని టైప్ చేస్తే ఆప్షన్లు కనిపిస్తాయి. ఆయా ఆప్షన్లను ఫాలో అవుతూ టికెట్ బుకింగ్‌తో పాటు అవసరమైతే రద్దు చేసుకోవచ్చు.

**ప్రయోగాత్మకంగా...**

ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్(ఏఎఫ్‌సీఎస్) సేవలను తొలుత పుష్పక్ బస్సుల్లో ప్రయాణించే వారికి అమలుచేస్తున్నారు. ఈ విధానాన్ని మియాపూర్, కంటోన్మెంట్ బస్‌డిపోల నుంచి రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే బస్సుల్లో అమలుచేస్తున్నారు. త్వరలో గరుడ ప్లస్, రాజధాని, డీలక్స్, సూపర్ క్లాస్ తదితర హైఎండ్ బస్సులకు సేవలను విస్తరించనున్నారు.




**బస్ పాసులు సైతం..**

ప్రయాణికుల్లోని కొన్నివర్గాలకు బస్‌పాసులు జారీ చేస్తున్న ఆర్టీసీ సంస్థ ఈవిధానాన్ని డిజిటలైజేషన్ చేసింది. పేపర్ పాస్‌లకు స్వస్తి పలికి, స్మార్ట్ పాస్‌లను అందించేందుకు అవసరమైన సాంకేతికతను అభివృద్ధి చేసింది. సంస్థ జారీ చేసిన ఈ-పాస్‌లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని బస్‌లో ప్రయాణిస్తున్న తరుణంలో కండక్టరుకు చూపిస్తే టిమ్ మిషన్ ద్వారా స్కాన్ చేసి ధ్రువీకరిస్తారు.

**రాష్ట్ర రాజధానిలో ఇప్పటికే..**

ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టమ్(ఏఎఫ్‌సీఎస్) విధానం ద్వారా రాష్ట్ర రాజధానిలో ఇప్పటికే 20 శాతం టికెట్లను జారీ చేస్తున్నట్లు రవాణా శాఖామంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ముషీరాబాద్ డిపోలో ఇటీవల పర్యటించిన మంత్రి ఈ టెక్నాలజీ వినియోగంలో ఎదురవుతున్న అనుభవాలను స్వయంగా తెలుసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఎఫ్‌సీఎస్‌ను అమలుచేస్తామని ప్రకటించారు.

TGSRTC Gamyam Track-Ride-Arrive

**● ఉపయోగకరంగా గమ్యం యాప్..**

మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టీసీ యాజమాన్యం ప్రయాణికుల బస్సు ప్రయాణ అనుభవాలను విప్లవాత్మకంగా మారుస్తోంది. విమానం, రైలు తరహాలో బస్సు ట్రాకింగ్ సిస్టమ్‌ను తెలియజేసేలా 'ఆర్టీసీ గమ్యం' యాప్‌ను ఇప్పటికే తీసుకువచ్చింది. ఈ యాప్ ద్వారా ప్రయాణికులు తాము ప్రయాణించే బస్ ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు. బస్సు కోసం ఎదురుచూడకుండా సమయాన్ని ఆదా చేసేందుకు ఈ యాప్ దోహదపడుతోంది. అయితే ఇటీవల కాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో గమ్యం యాప్ సాఫ్ట్‌వేర్‌ను సాధారణ బస్సుల నుంచి ఈ-బస్సులకు తరలించే తరుణంలో స్వల్ప సాంకేతిక సమస్యలు ఏర్పడినట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు తెలిపారు.



**ప్రయాణికుల సౌలభ్యం కోసమే..**

ప్రయాణికులకు సులభతరమైన సేవలందించేందుకు టీఎస్ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే డిజిటల్ సేవలను ప్రోత్సహిస్తున్నాం. పలు విభాగాలలో ఏఐ సేవలను ప్రవేశపెట్టి ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నాం. వాట్సాప్ ద్వారా బస్ టికెట్స్ జారీ చేసే సాంకేతికతను రాష్ట్రరాజధాని హైదరాబాద్‌లోని రెండు డిపోల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. అమలులో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించి త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోలకు ఆయా సేవలను విస్తరించే అవకాశం ఉంది. ప్రయాణికుల సౌలభ్యం కోసం సంస్థ పలు మార్పులకు శ్రీకారం చుడుతోంది.

కొణతం జాన్‌రెడ్డి, ఆర్టీసీ రీజనల్ మేనేజర్ (నల్లగొండ)

గుర్తు తెలియని వాహనం ఢీకొని

## యువకుడి మృతి

తిరుమలగిరి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం నాగారం మండలం మాచిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన వడ్డే కృష్ణ(25) తిరుమలగిరిలో పనులు ముగించుకొని నడుచుకుంటూ వెళ్తున్నాడు. సూర్యాపేట రోడ్డులో ఇండియన్ పెట్రోల్ పంపు సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణ తల్లి అంజమ్మ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## పాముకాటుతో మహిళా రైతు..



ధనమ్మ(ఫైల్)


తిరుమలగిరి(సాగర్), సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలం గోడుమడక గ్రామంలో మంగళవారం పొలంలో పనులు చేస్తుండగా పాము కాటుకు గురై మహిళా రైతు మృతి చెందింది. మహిళారైతు కుటుంబీకులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బూడిద ధనమ్మ(39) ఇటీవలి వర్షాలకు సొంత పత్తి పొలంలో కలుపు బాగా పెరగడంతో స్వగ్రామానికి చెందిన కూలీలను తీసుకోని పొలానికి వెళ్లింది. ఈ క్రమంలో ఏపుగా పెరిగిన గడ్డిని తొలగిస్తుండగా కాలిపై పాము కాటేయడంతో వెంటనే గట్టిగా అరిచింది. దీంతో అప్రమత్తమైన పక్కనే ఉన్న కూలీలు స్పృహ తప్పిన ధనమ్మను సాగర్ కమలానెహ్రూ ఆసుపత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగానే ధనమ్మ మృతిచెందింది. ధనమ్మకు భర్త, ఇద్దరులు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ధనమ్మ పాముకాటుతో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## ఉపాధ్యాయురాలిపై కేసు నమోదు

చిట్యాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా చిట్యాల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు గోగికార్ మాధవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఇదే పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలిగా బాధ్యతలు నిర్వరిస్తున్న సమయంలో పీఎంశ్రీ పథకం కింద మంజూరైన నిధుల దుర్వినియోగం చేశారన్న ఫిర్యాదులతో డీఈవో విచారణకు ఆదేశించారు. ఈ నెల 1న విచారణకు వచ్చిన జిల్లా ఫైనాన్షియల్ అకౌంట్స్ ఆఫీసర్ యోగేంద్రనాద్, ఎంఈవో పోనుగోతు సైదానాయక్‌కు ఆమె సహకరించకపోవడంతో పాటు వారు స్వాధీనం చేసుకున్న రికార్డులను లాక్కోవడానికి ప్రయత్నించింది. విధులకు ఆటంకం కలిగించడంతో అదేరోజు వారు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

# ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు రాగిజావ

● అమలుకు ప్రభుత్వం నిర్ణయం
● ఒక్కో విద్యార్థికి వారంలో మూడు రోజుల పాటు అందజేత
● 10 గ్రాముల రాగి పిండి, 10 గ్రాముల బెల్లంతో జావ తయారీ



(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్య భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం మరో నిర్ణయం తీసుకుంది. పోషకాహార లోపంతో విద్యార్థులు ఇబ్బందులుపడుతున్న నేపథ్యంలో వారికి రాగిజావను అందించనుంది. ఇందుకోసం ఇప్పటికే సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్‌తో అంగీకారం కుదిరింది. 60 శాతం ట్రస్ట్, 40 శాతం ప్రభుత్వ నిధులతో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. విద్యార్థుల్లో చాలామంది పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ నివేదికలు చెబుతున్నాయి. ఆరోగ్యం విషయంలో సరిగా లేకపోతే విద్యార్థులు విద్యపై దృష్టి సారించలేరని ప్రభుత్వం భావించింది. ఈ క్రమంలో పోషకాలతో కూడిన రాగిజావను అందించాలని నిర్ణయించింది.

**వారంలో మూడు రోజుల పాటు**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వారంలో మూడు రోజుల పాటు రాగిజావను అందించనున్నారు. ఉదయం ప్రార్థనా సమయానికి ముందు అందిస్తారు. ఒక్కో విద్యార్థికి 10 గ్రాముల రాగిపిండి, 10 గ్రాముల బెల్లం కలిసి రాగిజావను తయారు చేయనున్నారు. ఇప్పటికే వారంలో మూడురోజులు కోడిగుడ్లు అందిస్తుండగా, మిగిలిన మూడు రోజుల్లో రాగిజావను అందించనున్నారు. రాగిజావను తయారు చేసే బాధ్యతను మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు అప్పగించారు. ఇందుకోసం ఒక్కో విద్యార్థికి 25 పైసల చొప్పున వారికి ఇవ్వనున్నారు. మండల రీసోర్స్ కేంద్రం నుంచి పాఠశాలలకు విద్యార్థుల సంఖ్య ఆదారంగా రాగి పిండి, బెల్లం పదార్థాలను సరఫరా చేయనున్నారు.

**సూర్యాపేట జిల్లాలో 881 ప్రాఠశాలలు**

జిల్లా పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 881 పాఠశాలలు ఉన్నాయి. 49వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇప్పటికే విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం అమలుచేస్తున్నారు. తాజాగా రాగిజావను కూడా త్వరలో అందించనున్నారు.

**రాగిజావతో ప్రయోజనాలు**

రాగిజావ తీసుకోవడంవల్ల అనేక ఉపయోగాలు కలగనున్నాయి.

● రాగులు, బెల్లం పదార్థాల్లో కాల్షియం, ఐరన్ ఎక్కువగా ఉంటాయి.

● రాగులు ఎముకల ఆరోగ్యానికి, ఐరన్ అలసట, రక్తహీనతను నివారించగానికి ఉపయోగపడనుంది.

● అధికఫైబర్, ప్రోటీన్ ఉండడంలో ఈ పోషకాలు జీర్ణక్రియకు, కండరాల అభివృద్ధికి తోడ్పడుతాయి.

**త్వరలో అమలు చేస్తాం**



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు త్వరలో రాగిజావను అందజేస్తాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఇప్పటికే మధ్యాహ్నం భోజనంలో వారంలో మూడురోజులు కోడిగుడ్డు అందజేస్తున్నాం. మిగిలిన రోజులు రాగిజావను అందిస్తాం. రాగిజావతో విద్యార్థులకు పోషకాలు అందుతాయి.

అశోక్‌కుమార్, డీఈవో సూర్యాపేట.

# నలుగురు కాపర్ వైర్ దొంగల అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ రామకృష్ణారెడ్డి, మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్

కోదాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్లను చోరీ చేస్తున్న నలుగురు దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు సూర్యాపేట జిల్లా కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మార్చి, మే నెలల్లో మునగాల పరిధిలోని నాగార్జునసాగర్ కాల్వపై ఎత్తిపోతల కోసం అమర్చిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైరు దొంగతనం జరిగింది. ఈ చోరీలపై సంబంధిత అధికారులు, రైతులు ఫిర్యాదు మేరకు మునగాల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ కొత్తపల్లి నర్సింహ ఆదేశాల మేరకు సాగర్ కాల్వపై పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ స్థానిక ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం విశ్వసనీయ సమాచారంతో బరాఖత్‌గూడెం వద్ద నాగార్జునసాగర్ కాల్వపై అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో తమది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు పట్టణానికి చెందిన పాలకుర్తి వెంకటరామయ్య, గుంటకళ్ల కాజేశ్వరరావు, బోయపాటి అశోక్‌కుమార్, దేవరకొండ ఇషాంక్‌లుగా గుర్తించారు. విచారణలో మునగాల, నడిగూడెం మండలాల పరిధిలోని నాగార్జునసాగర్ కాల్వపై ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును చోరీ చేస్తున్నట్లు వారు అంగీకరించారని డీఎస్పీ తెలిపారు. వీరితో పాటు చోరీలో భాగస్వామిగా ఉన్న మరో వ్యక్తి బలిగా శ్రీకాంత్ పరారీలో ఉన్నాడన్నారు. నలుగురి నుంచి రూ.2.50 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుల్లో వెంకటరామయ్య గతంలో కాపర్ వైర్ దొంగతనాలు చేసిన కేసులో ఉన్నాడన్నారు. నిందితులందరికీ నేరచరిత్ర ఉందని డీఎస్పీ తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశ్యంతో ఒంగోలులో సెల్ఫ్ డ్రైవర్ కారు తీసుకుని కోదాడ సమీపంలోని ప్రాంతాలకు వచ్చి చోరీలకు పాల్పడుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీరు సుమారు 5 క్వింటాళ్ల కాపర్ వైరు చోరీ చేసినట్లు తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో కీలకంగా వ్యవహరించిన మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, సీపీఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్ఐ బీ ప్రవీణ్‌కుమార్, ఐడీ పార్టీ రామారావు, కొండలు, సూర్యాపేట సీపీఎస్ ఎస్ఐ యాదవేందర్‌రెడ్డి, సిబ్బంది, మల్లేశ్, శివ, ఆనంద్, శ్రీనులను కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి అభినందించారు.



## డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలకు రుష్మిత ఎంపిక

నల్లగొండ రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ డివిజన్ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎస్‌సీడీడీ గర్ల్స్ బీ హాస్టల్ విద్యార్థిని మీసాల రుష్మిత ఎంపికైంది. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో నిర్వహించిన అండర్-17 పోటీల్లో ప్రతిభను కనబరిచింది. రుష్మిత నల్లగొండ పట్టణంలోని మాల్‌బౌలి బాలికల హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతోంది. విద్యార్థిని డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికకావడంతో ఎస్‌సీడీడీ డిప్యూటీ డైరెక్టర్ శశికళ, హస్టల్ వార్డెన్ దూసరి భారతమ్మ, మాల్‌బౌలి పాఠశాల ప్రిన్సిపాల్ లలిత దేవిలు రుష్మితను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రుష్మిత ముందు మరింత ప్రతిభ కనబరిచాలని, ఆమెకు తమ సహాయసహకారాలు ఉంటాయన్నారు.

# హుజూర్‌నగర్‌లో భారీ చోరీ

రూ.60 లక్షల విలువచేసే బంగారు ఆభరణాలు చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో భారీ చోరీ జరిగింది. రూ.60 లక్షల బంగారు ఆభరణాలు, డైమండ్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. సీఐ చరమందరాజు, ఎస్ఐ బండి మోహన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని లక్కవరం గ్రామానికి చెందిన గాయం వీరభద్రారెడ్డి 30 ఏళ్లుగా హుజూర్‌నగర్‌లోని 3వ వార్డులోని ఏవీఎస్ టవర్ సెంటర్‌లో నివాసముంటున్నారు. బంధువులు చనిపోగా వీరభద్రారెడ్డి దంపతులు ఇంటికి తాళం వేసి ఆగస్టు 19న హైదరాబాద్‌కు వెళ్లారు. కాగా ఇంటిని శుభ్రం చేయాలని పనిమనిషిని మంగళవారం పురమాయించారు. ఆమె వెళ్లి చూడగా ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. దీంతో విషయాన్ని ఆమె వీరభద్రారెడ్డికి తెలిపింది. ఆయన ఇంటికి వచ్చి చూడగా గ్రౌండ్‌ఫ్లోర్‌లోని బెడ్ రూమ్ డోర్లన్నీ విరగ్గొట్టి, చిందరవందరగా పడేసి ఉండడాన్ని గమనించారు. అదేవిధంగా ఇంట్లోని సేఫ్ లాకర్‌ను మెషిన్ కట్ చేయడంతో ధ్వంసమై కనిపించింది. అందులోని డైమండ్స్ పొదిగిన గోల్డ్ చౌకర్ నెక్లెస్, డైమండ్స్ పొదిగిన బంగారపు వడ్డాణం, డైమండ్స్ పొదిగిన బంగారు జూకాలు, బంగారు చెవిబుట్టలు, దిద్దులు తదితర బంగారు వస్తువులు కనిపించలేదు. మొత్తం 60 తులాల బంగారు ఆభరణాలు, డైమండ్ నెక్లెస్ చోరీకి గురైందని నిర్ధారించుకుని వీరభద్రారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమందరాజు, ఎస్ఐ బండి మోహన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ చరమందరాజు తెలిపారు. కాగా హుజూర్‌నగర్ పట్టణంలో భారీ చోరీ జరగడం సంచలనంగా మారింది. వీరభద్రారెడ్డి కుటుంబం 12 రోజుల కిందట హైదరాబాద్‌కు వెళ్లడం గమనించిన దొంగలు చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. రెండురోజుల క్రితం మండలంలోని గోపాలపురంలోనూ రూ.20 లక్షల బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి.

## హామీలను ప్రభుత్వం అమలుచేయాలి

చౌటుప్పల్ టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పింఛన్‌దారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ యాదాద్రిభువనగిరి జిల్లా ఇన్‌చార్జి బిర్రు మహేందర్ అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్‌లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చౌటుప్పల్‌లో ఈ నెల 9వ తేదీన నిర్వహించే పింఛన్‌దారుల సభను విజయవంతం చేయాలని కోరారు. మందకృష్ణ మాదిగ హాజరవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి బోయ లింగస్వామి, నాయకులు అనిల్‌కుమార్, బోయ రామచందర్, బొడ్డు శ్రవణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థి వికాసమే లక్ష్యంగా

# 'స్కూల్ రేడియో'



ధ్యానం చేస్తున్న విద్యార్థులతో ఉపాధ్యాయుడు శ్రీనివాస్

**విద్యార్థికి పాఠాలు చెబితే సరిపోతుందా, మంచి వ్యక్తిత్వం, మంచి ఆలోచన విధానం కూడా వారిలో మెరుగుపడాలి కదా. ఇవే ప్రశ్నలు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలోని ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు కట్టెబోయిన శ్రీనివాస్‌ను ఆలోచింపజేశాయి. ఈ క్రమంలో విద్యార్థులకు నచ్చేలా, వారు మెచ్చేలా ఓ కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. స్కూల్ రేడియో పేరుతో విద్యార్థులతో పలు కార్యక్రమాలు చేయిస్తున్నారు.**

(ఆంధ్రజ్యోతి-కొండమల్లేపల్లి)

● వినూత్నంగా చేపట్టిన ఉపాధ్యాయుడు శ్రీనివాస్
● యోగా, ధ్యానంతో పాటు పలు పోటీలు
● విద్యార్థుల ఆలోచనల్లో మార్పుకు అవకాశం

కొండమల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 879 మంది విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల 9 గంటలకు ప్రారంభమవుతుండగా అంతకు అరగంట ముందుగానే 8.30 గంటల నుంచి 9 గంటల వరకు స్కూల్ రేడియో కార్యక్రమాన్ని ఉపాధ్యాయుడు కట్టెబోయిన శ్రీనివాస్ చేపడుతున్నారు. ప్రతి రోజూ మొదట 10 నిమిషాలు యోగ, ధ్యానంతో పాటు ఏదో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. పిల్లల్లో సమగ్ర మూర్తిత్వం, మానసిక వికాసం పెంపుకోసం పలు పోటీలు రూపొందించారు. నీతి కథలు, ఉపన్యాసం, పాటలు, మంచి అలవాట్లు, క్రమశిక్షణా-విలువలు, వ్యక్తిగత అభిప్రాయాలను విద్యార్థులు తోటివిద్యార్థులతో పంచుకుంటారు. ఇటు ఆనందంతో పాటు మానసిక వికాసానికి దోహదపడుండటంతో విద్యార్థుల హాజరు కూడా పెరిగింది. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో చురుకుదనం సహా పాఠ్య కృత్యాల్లో విరివిగా పాల్గొనే తత్వం పెరుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఇది భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషిగా వారు పేర్కొంటున్నారు.

**సొంత ఆలోచనలు మెరుగుపడతాయి**



స్కూల్ రేడియో కార్యక్రమం అనేది ఒక వినూత్న కార్యక్రమం. దీని ద్వారా విద్యార్థులకు సొంత ఆలోచనలు వస్తాయి, అంతేకాకుండా సొంతంగా కథలు చెబుతారు. పిల్లలకు ఆన్‌లైన్ డెవలప్‌మెంట్ ఉంటుంది. ఉపన్యాస పోటీల్లో నిర్భయంగా మాట్లాడే తత్వం పెరుగుతుంది. శారీరక మానసికంగా, ఆరోగ్యంగా వారు మెరుగుపడతారు.

కట్టెబోయిన శ్రీనివాస్, ఉపాధ్యాయుడు, కొండమల్లేపల్లి

# నాణ్యత నగుబాటు

● మట్టి ఇసుకతో కమ్యూనిటీహాల్ నిర్మాణం
● ఫిర్యాదు చేసిన అంబేడ్కర్ సంఘం

(ఆంధ్రజ్యోతి-హుజూర్‌నగర్)

హుజూర్‌నగర్ పట్టణంలోని 8, 9వ వార్డుల్లో విస్తరించిన గోవిందాపురంలోని ఎస్సీ కమ్యూనిటీహాల్ నిర్మాణం వివాదాస్పదంగా మారింది. ఈ కమ్యూనిటీ హాల్ కోసం ప్రభుత్వం బీఎంఎఫ్‌టీ, సీడీపీ నిధులు రూ.20లక్షల మంజూరుచేసింది. మొదటివిడతలో రూ.5 లక్షలు, రెండోవిడతలో రూ.15 లక్షలు మంజూరుచేశారు. అయితే ఏడాదిగా పనులు నిలిచిపోయాయి. స్లాబ్ వరకు నిర్మించారు. అయితే పిల్లర్లు, బేస్‌మెట్ పనుల్లో నాణ్యతా లోపాలు ఉన్నాయని అంబేడ్కర్ లయన్స్‌క్లబ్ సభ్యులు కలెక్టర్, ఆర్డీవో, మునిసిపల్ కమిషనర్, పంచాయతీరాజ్ అధికారులకు ఫిర్యాదుచేశారు. ఇసుక, కంకర, సిమెంట్ నిబంధనల మేరకు కలపడంలేదని గ్రామస్థులు ఆరోపించారు. వాగులు, వంకల నుంచి తెచ్చిన ఇసుకలో మట్టిశాతం ఎక్కువగా ఉందనే విమర్శలు ఉన్నాయి. ఒక ఫ్లోర్ వరకు ఉపయోగపడేలా మాత్రమే పిల్లర్లు నాణ్యత లేకుండా నిర్మించినట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో గతంలో నిర్మాణానికి ఉపయోగించేందుకు తెచ్చిన ఇసుక, కంకర, డస్ట్‌ను అధికారులు మరోచోటకు తరలించారు. రెండు అంతస్తుల వరకు నిర్మించేందుకు అనువుగా బలంగా నిర్మించాలని స్థానికులు, అంబేడ్కర్ సంఘం నాయకులు కోరుతున్నారు.



గోవిందాపురంలో నిర్మాణంలో ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాల్

**నాణ్యతతో పనులు చేపట్టాలి**



గోవిందాపురంలో ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి. మట్టిఇసుక, డస్ట్‌తో గ్రౌండ్ ఫ్లోర్‌లోని స్లాబ్ వరకు నిర్మించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదుచేశాం. పీఆర్ ఏఈ కూడా వచ్చి పరిశీలించారు. ఇసుక, డస్ట్‌లో నాణ్యత లేదని చెప్పారు. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తు కూడా నిర్మించుకునేలా పిల్లర్లు బలంగా నిర్మించాలి.

కామళ్ళ క్రాంతి, గోవిందాపురం

**నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించాం**

కమ్యూనిటీహాల్‌ను నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం. ముఖ్యంగా ఇసుకలో మట్టి శాతం ఎక్కువగా ఉందని గుర్తించాం. దానిని తిరిగి పంపించాం. గోదావరి ఇసుకతో పక్కా నిర్మాణం చేయాలని సూచించాం. గ్రౌండ్‌ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తు నిర్మించుకునేందుకు స్లాబ్ వేసే సమయంలో బలమైన పిల్లర్లు ఏర్పాటుచేయాలని సూచించాం. నాణ్యత లేకపోతే బిల్లులు నిలిపివేస్తాం.

మాధవ్, పీఆర్ ఏఈ

# ఆమెకు రక్షణ ఏదీ?

• సూర్యాపేట జిల్లాలో మహిళా ఉద్యోగులకు వేధింపులు • అన్నిశాఖల్లోనూ తప్పని తిప్పలు

**ఆకాశంలో సగం అంటారు. అవని అంతా ఆమే అంటారు. కానీ ఆమెకు రక్షణ లేకుండా పోయింది. ఇంటా, బయటా.. ఎటు చూసినా వేధింపులే. ఉద్యోగం కోసం కార్యాలయానికి వెళితే అక్కడ, పనికోసం పొలానికి వెళ్లినా అక్కడ కూడా వేధింపులే. ఇన్ని తట్టుకొని ఆమె ముందుకు సాగేదెలా.. అన్న అంశం చర్చనీయాంశమైంది. కొంత కాలంగా సూర్యాపేట జిల్లాలో మహిళా ఉద్యోగులపై జరుగుతున్న వేధింపులపై కథనం..**

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



సూర్యాపేట జిల్లాలో మహిళా ఉద్యోగులకు వేధింపుల తిప్పలు తప్పడంలేదు. వారు పనిచేసే ప్రదేశాల్లో కొంతమంది ఉన్నతాధికారుల నుంచి తీవ్ర వేధింపులకు గురవుతున్నారు. తోటి ఉద్యోగులు కూడా కొంత మంది వేధిస్తున్నారు. జిల్లాలో ఇటీవలి కాలంలో మహిళా ఉద్యోగులపై అనేక వేధింపుల ఘటనలు చోటు చేసుకున్నాయి. ఉన్నతాధికారుల వేధింపులు తట్టుకోలేక.. బయటకు చెప్పుకోలేక మదన పడుతున్నారు. ఉన్నతాధికారులు తమను వేధిస్తున్నా, బయటకు చెబితే ఇంకా ఒత్తిడికి గురిచేస్తారేమోనని భయపడుతున్నారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ ఏఈఓగా పనిచేస్తున్న మహిళను అదేశాఖలో పనిచేసే ఏవో బాలకృష్ణ ఇబ్బందికి గురిచేయడంతో బాలకృష్ణను కలెక్టర్ సస్పెండ్ చేశారు. నూతనకల్ మండల వ్యవసాయ అధికారి మురళీబాబు సైతం వ్యవసాయ విస్తరణ అధికారి అయిన మహిళా ఉద్యోగిని వేధించాడు. విషయం ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో విచారణచేసి సస్పెండ్‌చేశారు. అదేవిధంగా నూతనకల్ మండల పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వాసా ప్రవీణ్ తన కిందిస్థాయి మహిళా ఉద్యోగిని వేధింపులకు గురిచేశాడు. దీంతో ఉన్నతాధికారులు శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అదేవిధంగా ఆత్మకూర్(ఎస్) మండలం నెమ్మికల్‌లో ప్రధానోపాధ్యాయుడు శ్రీహరి తన తోటి ఉపాధ్యాయురాలిని వేధించాడు. దీంతో ఆయనను కూడా ఉన్నతాధికారులు విచారణ చేసి సస్పెండ్ చేశారు. కలెక్టరేట్‌లో ఉన్న డీఎంహెచ్‌వో కార్యాలయంలో విధులు నిర్వహించే మహిళా అధికారిని తన తోటి ఉద్యోగి వేధింపులకు గురిచేస్తున్నాడని, భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని ఉద్యోగులకు చెప్పడంతో వారు వారించి సమస్యను పెద్దదిగా మారకుండా చూశారు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహించే మహిళా డాక్టర్‌పై ఓ విభాగానికి చెందిన జిల్లా అధికారి కళ్యాణ్‌చక్రవర్తి వేధింపులకు గురి చేయడంతో అతనిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఇలా నిత్యం మహిళలపై ప్రభుత్వ కార్యాలయాల్లో వేధింపులకు పాల్పడుతున్నారు. ఇటు విధుల్లో ఒత్తిడి అటు తోటి ఉద్యోగుల నుంచి వేధింపులతో మహిళలు తీవ్రమనోవేదనకు గురవుతున్నారు.

### పని ప్రదేశంలో కనిపించని రక్షణ

లైంగిక వేధింపుల నిరోధక చట్టం-2013 ప్రకారం మహిళలకు రక్షణ కల్పించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పరిశ్రమలు, ఆస్పత్రులు, షాపింగ్‌మాల్స్‌తోపాటు ఉపాధిహామీ పనిప్రదేశాల్లో, ఇటుక బట్టీల్లో, భవన నిర్మాణ కేంద్రాల్లో మహిళల భద్రతకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకున్నా, అది కేవలం కాగితాలకే పరిమితమవుతుంది. ఇటీవల అధికారులు 20 కమిటీలు ఏర్పాటుచేశారు. అయితే ఈ కమిటీల్లో ఉండే సభ్యులు పని ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, సమస్యలపై ఎలాంటి దృష్టిసారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. వేధింపుల నివారణకు అవగాహన సదస్సులు నిత్యం నిర్వహించాల్సి ఉంది. అయితే ఆ దిశగా కార్యాచరణ రూపొందించడం లేదు. దీంతో మహిళలకు ఇబ్బందులు తప్పడంలేదు.

### ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చు

పని ప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురైతే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసుకోవచ్చు. దీంతో కమిటీ సభ్యులు అంతర్గతంగా విచారణ చేపట్టి జిల్లా అధికారి, కలెక్టర్, మహిళా శిశుసంక్షేమ అధికారికి పంపిస్తారు. విచారణలో నేరం రుజువైతే నేర తీవ్రతను బట్టి నిందితులపై 60 రోజుల్లో చర్యలు తీసుకుంటారు. బాధిత మహిళలు ఉచితంగా న్యాయ సహాయం పొందడానికి సఖికేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది.

**అధికారులకు సమాచారం ఇవ్వాలి**



పనిప్రదేశాల్లో మహిళలు వేధింపులకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. అంతేకాక 100కు ఫోన్ చేస్తే విచారణ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే వివరాలు గోప్యంగా ఉంచుతాం.

నర్సింహ, ఎస్పీ, సూర్యాపేట

## కవితపై కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

• బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య

దేవరకొండ/నార్కట్‌పల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలతో పార్టీకి నష్టం జరుగుతుందని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తప్పు చేస్తే కుటుంబ సభ్యులనైనా సహించబోమని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గతంలోనే చెప్పారని గుర్తుచేశారు. కన్న కూతురి కంటే కూడా కష్టంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్ ముఖ్యమని తీసుకున్న నిర్ణయం హర్షించదగినదని ఆయన పేర్కొన్నారు. కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేయడం ద్వారా పార్టీకి ఎలాంటి నష్టం లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. పార్టీ గీత ఎవరు దాటినా వేటు తప్పదనే సంకేతాన్ని అధిష్ఠానం అందరికీ ఇచ్చినట్టేనన్నారు.

## జాతీయ క్యాంప్‌నకు ఆలేరు ఎన్‌సీసీ కేడెట్లు



వరంగల్ బయలుదేరిన ఎన్‌సీసీ కేడెట్లు

ఆలేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లో జరుగుతున్న జాతీయ సమైఖ్యత ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్ జాతీయ క్యాంప్‌నకు యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు హైస్కూల్‌కి చెందిన ఎన్‌సీసీ కేడెట్లు ఎంపికయ్యారు. 10 మంది కేడెట్లతోపాటు ఎన్‌సీసీ అధికారి ఎంపిక కాగా, వారు మంగళవారం బయలుదేరి వెళ్లారు. జాతీయ క్యాంప్ ఈ నెల 2వ తేదీ నుంచి 13వ తేదీ వరకు జరుగుతుందని, రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, బీహార్, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి కేడెట్లు ఈ క్యాంప్‌నకు హాజరవుతున్నట్లు ఎన్‌సీసీ అధికారి దూడల వెంకటేష్ తెలిపారు. ఈ శిబిరాన్ని కేడెట్లు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు



క్షేత్రపాలకుడికి హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, లక్ష్మీనరసింహుడికి నిత్యకల్యాణం, నిత్యార్చనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి ఆలయంలో అర్చకులు వేదమంత్ర పఠనాలతో పంచామృతాభిషేకం చేసి, తమలపాకులు, సింధూరం, వివిధరకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు నిర్వహించి హారతి ఇచ్చారు. ప్రధానాలయంలో స్వయంభువులను సుప్రభాతసేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణపర్వాలను పాంచ రాత్రగమశాస్త్రరీతిలో నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి, ముఖ మండపంలోనిస్పటిక మూర్తులకు నిత్యపూజలు, నిత్య రుద్రహవనం శైవాగమన పద్ధతిలో కొనసాగాయి. పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని పంచామృతాలతో అభిషేకించి ఆకుపూజ చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 12,43,865 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్. వెంకట్రావు తెలిపారు.



యాదగిరికొండపై క్యూలైన్లలో భక్తుల రద్దీ

## రజాకార్లను తరిమిన వీరులనుగన్న నేల ఇది

• అమరవీరుల త్యాగాలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు • బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు



చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో అమరవీరుల స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న రామచందర్‌రావు

చిట్యాలరూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రజాకార్లను తరిమిన వీరులను గన్న నేల ఇది అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని మంగళవారం నల్లగొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలపై దాడులు చేస్తూ.. హతమారుస్తున్న రజాకార్లపై వీరోచితంగా పోరాడి వారిని తరిమికొట్టిన గుండ్రాంపల్లి అమరవీరుల ధైర్యం వెలకట్టలేనిదన్నారు. దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్రం వచ్చినా కూడా తెలంగాణ ప్రాంతంలో నిజాం, రజాకార్ల పరిపాలనతో స్వాతంత్ర్యం రాకపోవడం అత్యంత బాధాకరమైన విషయమన్నారు. 1948 సెప్టెంబరు 17న తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. రజాకార్ల చేతిలో ఎంతో మంది హతమయ్యారని, వారి త్యాగాలను పాలకులు విస్మరించడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ బుద్ధి తెచ్చుకోవాలని, పక్క రాష్ట్రాలైన కర్నాటక, మహారాష్ట్రలో ఇప్పటికీ విమోచన దినోత్సవాన్ని ఆయా ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలన్నారు. అమరుల త్యాగాలను గుర్తించడం మనందరి బాధ్యత అని అన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబాలను రామచందర్‌రావు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, ఎమ్మెల్యే అంజిరెడ్డి, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, డాక్టర్ గంగిడి మనోహర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, ప్రకాష్‌రెడ్డి, గూడూరు నారాయణరెడ్డి, పాదూరి కరుణ, వీరెల్లి చంద్రశేఖర్, కొండేటి శ్రీధర్, వెంకన్న, సేవేళ్ల మహేందర్, కళ్యాణ్‌నాయక్, నకిరేకంటి మొగులయ్య, లలూనాయక్, పిల్లి రామరాజు యాదవ్, కంకణాల నివేదిత, దినకర్, విక్రమ్‌రెడ్డి, నూకల వెంకటనారాయణరెడ్డి, పీక వెంకన్న పాల్గొన్నారు.

### కాంగ్రె‌స్‌కు గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం

చౌటుప్పల్ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రె‌స్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి నల్లగొండ జిల్లా పర్యటనకు వెళ్లి వస్తూ రామచందర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, చౌటుప్పల్ మునిసిపాలిటీలోని లింగోజీగూడలో కొద్ది సేపు ఆగి కార్యకర్తలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని, బీజేపీ వైపు ప్రజలు చూస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి మద్దతు కూడగట్టాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షురాలు కడారి కల్పన, జిల్లా కార్యదర్శి ఆర్ దీపిక, నాయకులు దోనూరు వీరారెడ్డి, రమనగోని శంకర్, దూడల భిక్షంగౌడ్, ముత్యాల భూపాల్‌రెడ్డి, బత్తుల జంగయ్య, కడారి అయిలయ్య, ఊడుగు వెంకటేశం, వనం ధనుంజయ్య, రంగయ్య, దామోదర్‌రెడ్డి, శివప్రసాద్ పాల్గొన్నారు.



## సాగర్ ప్రాజెక్టు గేట్లు మూసివేత

నాగార్జునసాగర్/కేతేపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు 15రోజులుగా సాగర్ ప్రాజెక్టు 26క్రస్ట్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. మంగళవారం రాత్రి కృష్ణమ్మ నెమ్మదించడంతో మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో క్రస్ట్‌గేట్లను మూసివేశారు. మంగళ వారం సాయంత్రం ఎగువ నుంచి వరద రాక తగ్గడంతో 5గంటలకు 8గేట్లను మూసివేసి 18గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. రాత్రి 7గంటల సమయంలో ఎగువ నుంచి వరద రాక మరింతగా తగ్గడంతో మరో 10గేట్లను మూసి వేసి 8గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. రాత్రి 9 గంటల సమ యంలో ఎగువ నుంచి వరద రాక ఇంకా తగ్గడంతో గేట్లను మూసి వేశారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590అడుగులు (312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 585.70అడుగులుగా (299.4545టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10వేల క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 5156క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 33,779 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 51,635 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 51,635 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

### నెమ్మదించిన మూసీ... 2గేట్ల నుంచి నీటి విడుదల

హైదరాబాద్, సికింద్రాబాద్ జంటనగరాల పరిధితో పాటు ఎగువ మూసీ నది పరివాహక ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గత వారం రోజులుగా ప్రాజెక్టుకు కొనసాగిన ఇన్‌ఫ్లో మంగళవారం మరింత తగ్గుముఖం పట్టింది. మంగళవారం 2,679.72క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా రెండు క్రస్టుగేట్ల నుంచి 2,156.46క్యూసెక్కులు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 353.56క్యూసెక్కులు మొత్తం 2530.24క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 645అడుగులు(4.46టీఎంసీ)ల నీటి నిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు మంగళవారం సాయంత్రానికి 643.75అడుగులుగా(4.13టీఎంసీ) నమోదైంది.

## యూరియా దొరకదు.. కష్టాలు తీరవు



మోతె మండలం నామవరంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

మోతె, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామానికి యూరియా లోడ్ వస్తుందని తెలియడంతో సూర్యాపేట జిల్లా మోతె మండల పరిధిలోని నామవరంలో మంగళవారం తెల్లవారకముందే రైతులు యూరియా కేంద్రం వద్ద పెద్దసంఖ్యలో క్యూ కట్టారు. ఉదయం 8గంటలకు లోడ్ లారీ వచ్చే సరికి 400మందికి పైగా రైతులు గోదాం తాళం తీయకముందే ఉన్నారు. క్యూలైన్‌లో కొందరు చెప్పులు పెట్టారు. 200 బస్తాలు మాత్రమే రావడంతో లైన్‌లో ఉన్న వారు రెండితలు ఉండడంతో పంపిణీ సమయంలో రైతులు ఘర్షణకు దిగారు. దీంతో పోలీసులు లైన్‌ల ప్రకారం పంపిణీ చేయించారు. నామవరానికి సిరికొండ సొసైటీ ద్వారా వచ్చిన లోడ్‌లో ఉన్న మిగితా బస్తాలు సర్వారం సొసైటీకి తరలించారు. అక్కడ రైతులు 500 పైబడి రైతులు ఉండడంతో పోలీసుల పర్యవేక్షణలో పంపిణీ చేశారు. మండలంలో వానాకాలం వరి సేద్యం పెరగడంతో యూరియా అంచనాలు వేయాల్సిన అధికారులు విఫలమయ్యారని రైతులు వాపోతున్నారు.

### యూరియా కోసం పడిగాపులు

తుంగతుర్తి: యూరియా కోసం రైతులు నానా అవస్థలు పడక తప్పడం లేదు. యూరియా సరైన సమయంలో రైతులకు అందుబాటులో లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం తుంగతుర్తి సొసైటీకి యూరియా వస్తుందని తెలియడంతో వేకువ జామున నుంచి రైతులు తుంగతుర్తిలోని రైతు సేవా సహకార సంఘం చేరుకొని పడిగాపులు కాస్తున్నారు. కొందరు రైతులు తమ పనులను వదులుకొని మరీ యూరియా కోసం వేచి ఉంటున్నారు. ప్రభుత్వం రైతుల కోసం యూరియాను తెప్పించాలని రైతులు కోరుతున్నారు.

## వ్యర్థాల దుర్వాసనకు చెక్




- బయోరికో ఓడౌర్ ఎలిమినేటర్ల పంపిణీ
- గ్రామపంచాయతీల్లో ప్రయోగాత్మక ప్రయత్నం
- ఫలితాలను బట్టి క్రమంగా వాడకంపై నిర్ణయం
- వ్యర్థాల డీ కంపోజ్‌కు పరిష్కారం

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో బాధ్యతారాహిత్యంగా పడవేసే వ్యర్థాలతో అటు పర్యావరణానికి ఇటు జీవావరణానికి కలుగుతున్న హానిని దృష్టిలో ఉంచుకుని కొత్త రకం ప్రయోగానికి జిల్లా పాలనా యంత్రాంగం ప్రయత్నాలు ప్రారంభించింది. ముఖ్యంగా వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామపంచాయతీలు బ్లీచింగ్ పౌడర్, ఫినాయిల్, సున్నం, దోమల లిక్విడ్, యాంటీ లార్వా వంటి వాటిని కొనుగోలు చేసి వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తలు చేపట్టడం సాధారణమే. కానీ బహిరంగ ప్రదేశాల్లో నిర్లక్ష్యంగా పడవేసే వ్యర్థాల కారణంగా వచ్చే దుర్వాసనతో పాటు వాటిని భుజించిన జంతువులు పశుపక్షాదుల ద్వారా సమాజానికి ఎదురయ్యే అనారోగ్య పరిస్థితులను దూరం చేయాలని భావించింది. ఈ సమస్యను బయోలాజికల్ ట్రీట్‌మెంట్ సొల్యూషన్‌తో కొంతమేరకైనా పరిష్కరించుకోవచ్చని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గుర్తించారు. కలెక్టర్ సూచన మేరకు జిల్లా పంచాయతీ అధికారి ద్వారా బయోరికో కంపెనీకి చెందిన ఓడౌర్ ఎలిమినేటర్ అనే పౌడర్ ప్యాకెట్లను గ్రామపంచాయ తీలకు కొద్ది మొత్తంలో పంపిణీ చేసి ప్రయోగాత్మక ప్రయత్నానికి సిద్ధమవుతున్నారు.

### ఎక్కడెక్కడ వాడతారు..

బయోరికో ఓడౌర్ ఎలిమినేటర్ పౌడర్‌ను బకెట్ నీటిలో 5గ్రాములు కలిపి వ్యర్థాలపై చల్లా లి. లేదా పత్తిపంటలపై రసాయనాలను పిచికా రీ చేసినట్లు గానే చేయాలి. ముఖ్యంగా దుర్వాస న విపరీతంగా వచ్చే కోళ్ల ఫారాల వద్ద, గుట్టుచప్పుడు కాకుండా ఊరి శివార్లలో పడవేసే జంతు కళేబరాలపైనా, పెంట కుప్పలపైనా, భుజించిన తర్వాత పారవేసే వ్యర్థ ఆహార పదార్థాల కుప్పలపైన, కుళ్లిపోయిన వ్యర్థ పదార్థాల వద్ద వచ్చే దుర్వాసన అరికట్టేందుకు ఈ బయోరికో ఓడౌర్ ఎలిమినేటర్ పౌడర్‌ను వాడనున్నట్లు తెలిసింది.

**అన్ని జీపీలకు అందజేస్తున్నాం**

బయోరికో ఓడౌర్ ఎలిమినేటర్ పౌడర్ ప్యాకెట్లను జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలకు అందజేస్తున్నాం. ప్రధానంగా కుక్కలు బహిరంగ ప్రదేశాల్లో వదిలే వ్యర్థాలను భుజించడం ద్వారా పిచ్చికుక్కలుగా మారి కాటు వేస్తున్న ట్లు ప్రాథమికంగా భావించాం. కుక్కలు లేదా ఇతర జంతువుల కళేబరాలతో వచ్చే దుర్వాసనను అరికట్టవచ్చు. అయితే ఈ బయోరికో ఓడౌర్ ఎలి మినేటర్ ప్రాణాంత కం కాదని అది కేవ లం వ్యర్థాలను డీ కంపోజ్ మాత్రమే చేస్తుందని చెప్పారు. ఈ ఉత్పత్తికి సంబంధించిన కంపెనీ ప్రతినిధులు డెమో ఇచ్చిన తర్వాత వచ్చే ఫలితాలను బట్టి వీటి వాడకంపై ఓనిర్ణయానికి వస్తాం.

\- వెంకయ్య, నల్లగొండ, డీపీవో

### జనాభాను బట్టి ప్యాకెట్ల అందజేత

బయోరికో ఓడౌర్ ఎలిమినేటర్ కేజీ పరిమాణం గల ప్యాకెట్లను ఇప్పటికే గ్రామపంచాయతీలకు చేరవేస్తున్నారు. గ్రామ పంచా యతీల్లోని జనాభా ప్రాతిపదికన వీటిని అందజేస్తున్నారు. ఉదాహ రణకు 10వేల జనాభా ఉన్న గ్రామ పంచాయతీలకు నాలుగు ప్యాకెట్లు మూడు వేల జనాభా ఉన్న గ్రామపంచాయతీలకు మాత్రం ప్రస్తుతానికి ఒక ప్యాకెట్‌ను అందజేశారు. జిల్లాలోని అన్ని గ్రామాలకు వీటిని చేరవేసిన అనంతరం ఈ ప్యాకెట్ల వాడకం, ఉపయోగాలపై డెమో ఇవ్వనున్నారు. ప్రస్తుతానికి ఈ ప్యాకెట్లను గ్రామ పంచాయతీలకు చేరాయి. కానీ వీటిని ప్రభుత్వమే కొనుగోలు చేసి పంపిణీ చేస్తుందా లేక ఫినాయిల్, బ్లీచింగ్ కొన్నట్లు మాదిరిగానే డబ్బులు వెచ్చించి గ్రామపంచాయతీలే కొనుగోలు చేయాలా అనే విషయంలో ఇంకా స్పష్టత లేదు.

## పీహెచ్‌సీ భవనం ప్రారంభానికి ముస్తాబు

బీబీనగర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం ప్రారంభానికి ముస్తాబు అయింది. సాధ్యమైనంత తొందరలో వైద్య సేవలు ప్రారంభించేందుకు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. రూ.1.55కోట్ల వ్యయంతో నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ఈనెలలోనే వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ ప్రారంభించే అవకాశం ఉన్నట్లు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇప్పటికే భవనంలో వైద్య సేవలకు అనువుగా వసతి సౌకర్యాలు సమకూర్చారు.

## ఒక వ్యక్తికి ఒకేచోట ఓటుహక్కు ఉండాలి

ఆత్మకూరు(ఎం) సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తికి ఒకే చోట ఓటు హక్కు ఉండాలని తెలంగాణ ప్రాంత ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ జెట్ట శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చాలా గ్రామాల్లో చనిపోయిన వ్యక్తుల పేర్లు తొలగించడం లేదని, పెళ్లి చేసుకుని అత్తగారింటికి వెళ్లిన ఆడపిల్లల పేర్లు ఓటరు లిస్టులో అలాగే ఉన్నాయన్నారు. తల్లి గారి ఇంటి వద్ద అలాగే అత్తగారింటి వద్ద ఆడపిల్లలు ఓటు హక్కు కలిగి ఉంటున్నట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

### తెగుళ్ల నివారణకు
## జాగ్రత్తలు పాటించాలి

**ఎజాజ్‌అలీఖాన్, ఏవో, రామన్నపేట**



వానాకాలంలో వరిచేలకు తెగుళ్ల వ్యాపించే అవకాశాలు ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి (ఏవో) ఎండీ.ఎజాజ్‌అలీఖాన్ రైతులకు సూచించారు. తెగుళ్ల నివారణపై 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు చేశారు.
-(ఆంధ్రజ్యోతి-రామన్నపేట)

**ఆంధ్రజ్యోతి:** ప్రస్తుతం వర్షాకాలం సీజన్‌లో మండల వ్యాప్తంగా వరిసాగు ఎంత అయ్యింది?

**ఏవో:** 29000ఎకరాల్లో వరిసాగయ్యింది. 3500ఎకరాల్లో సన్నాలు, 25,500 ఎకరాల్లో దొడ్డు రకం ధాన్యం సాగు చేశారు.

**ఆంధ్రజ్యోతి:** మండలంలో రైతు భరోసాకు అర్హులైన రైతులు ఎంత మంది ఉన్నారు?

**ఏవో:** 16760 మంది రైతులకు వానా కాలం రైతు భరోసా వారి ఖాతాలో జమ అయ్యింది.

**ఆంధ్రజ్యోతి:** మండలంలో సాగు విస్తీర్ణానికి సరిపడు యూరియా అందుబాటులో ఉందా?

**ఏవో:** రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. యూరియా ఉంది.

**ఆంధ్రజ్యోతి:** కల్తీ విత్తనాలు, ఎరువు, పురుగు మందుల విక్రయంపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

**ఏవో:** ఇప్పటి వరకు ఫిర్యాదులు రాలేదు. అయినా రైతులను అప్రమత్తం చేస్తున్నాం.

**ఆంధ్రజ్యోతి:** తెగుళ్ళు సోకిన పంట పొలాలను అధికారులు సందర్శించి సూచనలు సలహాలు ఇస్తున్నారా?

**ఏవో:** తెగుళ్లు, చీడపీడలు సోకిన పంట పొలాలను పరిశీలిస్తున్నాం. రైతులకు ఎప్పుడూ అందుబాటులోండి తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

# సర్వర్ బిజీ

(5వ పేజీ తరువాయి)

ఎనిమిది మందికి అంతా హాజరుకాగా, ఇద్దరి ఫోన్‌లో ఎఫ్ఆర్ఎస్ నమోదుకాకపోవడంతో మిగతా ఉపాధ్యాయుల ఫోన్‌లో ఎఫ్ఆర్ఎస్ నమోదు చేసుకున్నారు.

● **బొమ్మలరామారం:** మండలంలోని యావపూర్ తండా ప్రాథమిక పాఠశాలలో సాంకేతిక లోపం కారణంగా ఉపాధ్యాయుడితోపాటు విద్యార్థుల ఎఫ్ఆర్ఎస్‌కు అరగంటకు పైగా సమయం పట్టింది.

● **చౌటుప్పల్‌టౌన్:** 10వ వార్డు బీసీ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో సాంకేతిక సమస్యలతో ఒక ఉపాధ్యాయురాలికి మాత్రమే సకాలంలో హాజరు నమోదైంది. మిగిలిన ముగ్గురికి యాప్ ఓపెన్ కాలేదు.

● **బీబీనగర్:** మండలం జమీలాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సిగ్నల్స్ సమస్య ఏర్పడటంతో ఉపాధ్యాయులు సిగ్నల్స్ కోసం ఆవరణమంతా తిరగాల్సి వచ్చింది.

● **ఆత్మకూరు(ఎం):** మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో 18 మంది ఉపాధ్యాయులకు 16 మంది హాజరయ్యారు. ఇద్దరికి నెట్‌వర్క్ ప్రాబ్లం రావడంతో ప్రార్థన అనంతరం హాజరు నమోదుచేశారు.

● **భువనగిరి రూరల్:** శివారులోని యూసుఫ్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఒకరు హాజరుకాగా, సిగ్నల్ సరిగా లేకపోవడంతో పాఠశాల ఆవరణలో యాప్‌లో హాజరు అప్‌లోడ్ చేశారు.

● **యాదగిరిగుట్ట రూరల్:** మండలంలోని మర్రిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా, ప్రార్థన సమయంలో ఉపాధ్యాయులు ఎఫ్ఆర్ఎస్ నమోదు చేశారు.



రాజాపేటలో ఎఫ్ఆర్ఎస్ నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

● **మోత్కూరు:** జడ్పీహెచ్ఎస్‌లో 28 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు, నలుగురు వృత్తి విద్యాకోర్సు ఉపాధ్యాయులు, ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్ ఉన్నారు. ఒక ఉపాధ్యాయుడు సెలవు పెట్టగా మిగతా వారంతా సకాలంలో చేరుకొని హాజరు నమోదుచేసుకున్నారు.

● **గుండాల:** మండలంలో వెల్మజాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 11మంది ఉపాధ్యాయులకు 10మంది ఉపాధ్యాయులు సకాలంలో హాజరు నమోదుచేశారు. ఒకరు సెలవులో ఉన్నారు.

● **చౌటుప్పల్ రూరల్:** మండలం అంకిరెడ్డిగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో హాజరు నమోదు చేశారు.

●**ఆలేరు రూరల్/ సంస్థాన్‌నారాయణపురం:** ఆలేరు మండలంలోని కొల్లూరు ఉన్నత పాఠశాల, సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సకాలంలో హాజరు నమోదుచేశారు.

## ఒక టీచర్..నలుగురు విద్యార్థులు

యాదగిరిగుట్ట రూరల్, సెప్టెంబరు 2, (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారిగూడెం పాఠశాలకు నలుగురు పిల్లలే హాజరవుతున్నారు. వీరికి చదువు చెప్పడానికి ఒక ఉపాధ్యాయులు హాజరవుతున్నారు. ఒక స్కావెంజర్, ఒక స్వీపర్ కూడా పాఠశాలకు వస్తున్నారు. గ్రామంలో 50 సంవత్సరాల క్రితం స్థాపించిన ప్రభుత్వ పాఠశాలలో మొదటగా ఇద్దరు ఉపాధ్యాయులు సుమారు 40 మంది వరకు విద్యార్థులు ఉండ గా పాఠశాల కొనసాగింది. కాలక్రమేణా విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు కోసం సైదాపురం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావి వద్ద ఉంటోంది. వారికిచెందిన ముగ్గురు విద్యార్థులు పాఠశాలకు హాజరవుతున్నారు. గ్రామానికి చెందిన మరో విద్యార్థి హాజరువుతున్నారు. గతంలో విద్యార్థులు పూర్తిగా పాఠశాలకు రాకపోవడంతో ఒక్క ఉపాధ్యాయురాలు మాత్రమే పాఠశాలకు వచ్చి వెళుతుండేవారు. ఈ విషయంపై ఆగస్టు 4న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది.



గ్రామస్థులతో సమావేశమైన డీఈవో (ఫైల్‌ఫొటో)

వెంటనే డీఈవో, ఎంఈవో పాఠశాలను సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. పిల్లలను పంపిస్తామని, పాఠశాలను కొనసాగించాలని వారు డీఈవోను కోరారు. పిల్లల సంఖ్యను పెంచాలని, లేదంటే పాఠశాలను మూసివేస్తామని డీఈవో చెప్పారు. ఇప్పటి వరకు నెల గడిచింది. నలుగురు విద్యార్థులే హాజరవుతున్నారు. ఈ విషయమై ఎంఈవో శరత్‌యామిని మాట్లాడుతూ పాఠశాలలో పిల్లల సంఖ్యను పెంచడానికి ప్రయత్నం చేస్తున్నామని, పిల్లలు రాకుంటే డీఈవో అనుమతితో చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# గణపయ్యకు పూజలు..భక్తులకు అన్నదానాలు

భువనగిరి టౌన్/భువనగిరి గంజ్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణంలోని ఆర్‌బీ నగర్‌లోని రవీంద్రభారత్ యూత్ మండపంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రగతినగర్‌లో గుర్రాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ గుర్రాల సంతోష శ్రీనివాస్, మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ పాల్గొన్నారు. భువనగిరి మండలం పెంచికలపహాడ్‌లో గణేష్‌మండపం వద్ద భువనగిరి రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్ఐ అనిల్ కుమార్ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. గోపి రాజయ్య జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మహేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భువనగిరి మునిసిపల్ మాజీ చైర్మన్ బర్రె జంహగీర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇటుకల దేవేందర్, శివలింగం, గోపి ప్రభాకర్, మహంకాళీ, నరసింహ, రవి, పరమేష్, మల్లేష్, రమేష్, మహేష్, మధు, సంజీవ, ఐలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మోత్కూరు : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మోత్కూరు అంగడి బజారులోని వినాయకుని మండపం వద్ద అంగడి బజారు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. దాతలు దొండ సోమేష్-ఉమ దంపతులు, కుమారులు వెంకటేష్, విష్ణు, కమిటి సభ్యులు బీసు రాహుల్, అవిశెట్టి ఉత్తేజ్, ఎడ్ల సంతోష్, మల్లేబోయిన వెంకటేష్, కల్లూరి ఉదయ్, కిరణ్, ఎండి.గౌస్ పాల్గొన్నారు. బృందావన్ కాలని వద్ద స్నేహ యూత్ అసోషియేషన్ ఆధ్వర్యంలోనూ అన్నదానం చేశారు.



పెంచికల్‌పహాడ్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న రూరల్ సీఐ చంద్రబాబు, ఎస్ఐ అనిల్‌కుమార్



భువనగిరిలో అన్నదానం ప్రారంభిస్తున్న కలెక్టర్ హనుమంతరావు, డీసీపీ అక్షాంశ్ యాదవ్

## వైఎస్ఆర్ సేవలు చిరస్మరణీయం

(ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్): దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రానికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. ఆలేరు మండలం మంతపరిలో వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు. భువనగిరిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ అవేజ్‌చిస్తి, భువనగిరి మునిసిపల్ మాజీ చైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్ పాల్గొన్నారు. వలిగొండలో పాశం సత్తిరెడ్డి, కంకల కిష్టయ్య, నూతి రమేష్‌రాజు పాల్గొన్నారు. బీబీనగర్, రాజాపేట, రామన్నపేట, మోత్కూరు, ఆత్మకూరు(ఎం) మండల కేంద్రాల్లో వైఎస్ఆర్ చిత్రపటాల వద్ద నివాళులర్పించారు.



భువనగిరిలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

## పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఆలేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆలేరు మండలంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఇళ్లు లేని పేదలతో కలిసి సీపీఐ ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కొలనుపాక గ్రామంలో ఇళ్లు లేని ప్రజలకు గ్రామంలోని ప్రభుత్వ భూమి సర్వే నెం. 8లో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, కొలనుపాక గ్రామకార్యదర్శి పొన్నబోయిన రవి, మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు మాటూరి జానమ్మ, నాయకులు పోతు ప్రవీణ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

ఆలేరు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తానని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కొల్లూరులో ఇటీవల మృతిచెందిన ఎండీ.నవీనా కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జనగాం శ్రీపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాజుల లావణ్య వెంకటేష్, శంకరయ్య, దీపా, దశరథ, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : భూదాన్‌పోచంపల్లిలో ఇటీవల మృతి చెందిన పోతగల్ల సత్యనారాయణ (సతీష్) కుటుంబాన్ని మంగళవారం పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు తడక వెంకటేష్ రూ. 10వేలు, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి రూ. 10వేలుచొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, జిల్లా నాయకులు ఎం అంబరీష్ రెడ్డి, మన్నెం వెంకట్‌రెడ్డి, పడమటి భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుడు జెన్నయ్య మృతి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుడు, భూదాన్‌పోచంపల్లి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మెరుగు జెన్నయ్య (65) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మంగళవారం పరామర్శించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కోట మల్లారెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సీత వెంకటేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి గునిగంటి మల్లేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్‌యాదవ్, నాయకులు చిలివేరు బాల్‌నర్సింహ, చింతకింది కిరణ్, సీత శ్రవణ్, జింకల యాదగిరి, బొంగు అయిలయ్య, కుంటోళ్ల మహేష్‌గౌడ్, సార బాలయ్యగౌడ్, మెరుగు బాలకృష్ణయాదవ్, స్థానిక మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు సామల మల్లారెడ్డి, కుడికాల అఖిల బలరాం, మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

బీబీనగర్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నరావులపల్లి ప్రాథమిక పాఠశాలకు స్థానిక విద్యావేత్త అసోసియేషన్ ప్రొఫెసర్ రచన విద్యార్థుల సౌకర్యార్థం హైపవర్ చారిట్రబుల్ మైక్‌ను బహూకరించారు. ఈమేరకు మంగళవారం ఎంఈవో సురేశ్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిహెచ్ఎం విష్ణు వాసుదేవ రెడ్డి, ఏబీసీ చైర్మన్ ఇ జంగమ్మ, ప్రధానోపాధ్యాయులు వెంకటచారి, అరుణ పాల్గొన్నారు.



మైక్‌సెట్‌ను ప్రారంబించిస్తున్న ఎంఈవో సురేష్‌రెడ్డి

## భారీ వర్షాలకు రూ.10కోట్ల నష్టం

(5వ పేజీ తరువాయి)

మేర కు అవసరం ప్రభుత్వానికి నివేదించింది. పంచాయతీరాజ్‌శాఖ పరిధిలో 3.1 కిలోమీటర్ల రోడ్డు కొట్టుకుపోగా, రెండుచోట్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఎనిమిది కల్వర్టులు దెబ్బతిన్నాయి. వీటిని తాత్కాలికంగా మరమ్మతు లు చేసేందుకు రూ.3.08లక్షలు, పూర్తిగా రోడ్లు వేసేందుకు రూ.63 లక్షల మేరకు అంచనాలు రూపొందించా రు. బీబీనగర్ మండలంలో మిషన్ భగీరథ పైపులైన్ దెబ్బతింది. దీంతో 54 గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అధికారులు ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాట్లుచేశారు. ఈ పైపులైన్ మరమ్మతులకోసం రూ.70లక్షలు అవసరమవుతాయని ప్రతిపాదనలు సిద్ధంచేశారు. జిల్లాలో మొత్తం 16 చెరువులు దెబ్బతినగా, వాటిలో ఎనిమిది చెరువులకు గండ్లు పడ్డాయి. జిల్లాలోని పెద్దచెరువు, కోటమర్తి, యాపాల్ చెరువు, చౌతకుంట, అడమకుంట, కర్నాలకుంట, తినోని చెరువు, కొత్తకుంట, ఊరచెరువు, జైనపల్లి చెరువు, నల్లకుంట కట్టలు కొట్టుకుపోయాయి. అదేవిధంగా ప్రతాప్ సాగర్ చెరువు, రాయిగిరి చెక్‌డ్యాం, వీరవెల్లి పెద్ద చెరువు, నారప్ప చెరువు, గాజుల వానికుంట, ఊరచెరువు తాత్కాలికంగా దెబ్బతిన్నాయి. చెరువులు నీరు వృథా కాకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టారు. రూ.75.6 లక్షల నిధులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. కొట్టుకుపోయిన చెరువుకట్టలో, కుంటల మరమ్మతుల కోసం రూ.5.71కోట్ల మేరకు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే నేరుగా పంట నష్టపరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని, చెరువులు, రోడ్డు మరమ్మతులు చేపట్టనున్నట్లు అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వీరారెడ్డి వెల్లడించారు.

## పిల్లల మానసిక సామర్థ్యాలను గుర్తించాలి

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పిల్లల్లో మానసిక సామర్థ్యాలను గుర్తించి, వారిని సానుకూలంగా ప్రేరేపిస్తే వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పదునెక్కుతాయని, చదువులో అభ్యసన వైకల్యాలు రాకుండా ఉండాలంటే వారి మనసుని మెప్పించే విధంగా వినోదంతోపాటు విద్యను అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ సైకలాజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రముఖ మైండ్ పవర్ స్పెషలిస్ట్, సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎం.ఏ కరీం అన్నారు. మంగళవారం పట్టణంలోని పాఠశాలల విద్యార్థులకు మనోవైజ్ఞానిక మానసిక వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డాక్టర్ కరీం మాట్లాడుతూ విద్యార్థుల్లో చదువుపట్ల ఏర్పడుతున్న ఆటంకాలను అధిగమించాలంటే వారిని మానసికంగా వేధించవద్దని తల్లిదండ్రులకు సూచించారు. అంతర్జాతీయ మెజీషియన్ రామకృష్ణ తన వరల్డ్ రికార్డ్ అంశాలను వివరిస్తూ మ్యాజిక్ అంశాలను పిలలకు వివరించారు. కార్యక్రమంలో పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, శాంతినికేతన్ హైస్కూల్, శ్రీ సరస్వతీ విద్యామందిర్, లిటిల్ ఫ్లవర్, జిబ్లక్‌పల్లి చైతన్య గ్రామర్ స్కూల్, జూలూరు గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

భువనగిరి రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ రంగాల ఆర్థిక సేవలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పరిపుష్టి సాధించాలని కెనరా బ్యాంకు ప్రధాన కార్యాలయ జనరల్ మేనేజర్ రమణామూర్తి అన్నారు. ఆర్థిక సేవల శాఖ మార్గదర్శకాల మేరకు మండలంలోని తుక్కాపురంలో మంగళవారం జిల్లా లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో జన సురక్ష బీమా పథకాలపై గ్రామస్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసదస్సులో కెనరా బ్యాంకు హన్మకొండ రీజినల్ మేనేజర్ శాంతికుమార్, ఎల్‌డీఎం శివరామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి లోకేశ్, భువనగిరి ఏపీఎం మల్లేశం, కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ నితిన్ రాజు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్థులు ఉన్నారు.

## ఎల్ఐసీ ఆవిర్భావ వేడుకలు

భువనగిరి టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ 69 ఆవిర్భావ దినోత్సవాలను భువనగిరిలో ఘనంగా జరుపుకుంటున్నారు. ఈమేరకు రెండవరోజు మంగళవారం జిల్లా ఆస్పత్రిలో పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ బీమాతో అందరి జీవితాలకు ధీమా ఉంటుందని అన్నారు. బ్రాంచ్ మేనేజర్ ఆర్ బలరాం, ఏవో కేష్య, అసిస్టెంట్ మేనేజర్ నాగేశ్వరరావు, ఉద్యోగులు, ఏజెంట్లు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి అభినందనీయం

ఆలేరు రూరల్, సెప్టెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్ర అభివృద్ధికి దాతలు కృషి చేస్తుండటం అభినందీయమని వైద్యాధికారిణి డాక్టర్ భార్గవి అన్నారు. మంగళవారం మండలంలోని శారాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాతలు మాజీ ఎంపీటీసీ రచ్చ కావ్యశ్రీ, రామ్‌నర్సయ్య, ఆలేరు మూడవ వార్డు మాజీ కౌన్సిలర్ బేతి రాములు 30 కుర్చీలను అందజేశారు. కార్యక్రమంలో పీఎస్‌సీఎస్ సిబ్బంది కృష్ణారెడ్డి, శోభారాణి, యాకయ్య, అనుజా, సునీల్ పాజల్, మరియమ్మ, పార్వతి, బీఆర్ఎస్ నాయకులు పుట్ట మల్లేష్, శనిగారం రవి, షరాబ్, సంతోష్, బింగి రవి, అంజన్‌కుమార్, సత్యనారాయణ పాల్గొన్నారు.

## క్రీడలతోనే ఆరోగ్యం

రాజాపేట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, క్రీడలతోనే ఆరోగ్యమని ఎంఈవో చందా రమేష్ కోరారు. మంగళవారం రాజాపేట మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడోత్సవాలను నిర్వహించారు. ఖోఖో ఫెడరేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నాతి కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గౌటె లక్ష్మణ్,మహేందర్‌గౌడ్,ప్రిన్సిపాల్ సుధాకర్,ప్రధానోపాధ్యాయులు రాజు,కిరణ్మయి,కోటిరెడ్డి, విజయలక్ష్మీ,శ్రీనివాస్, రవీందర్ రెడ్డి,వసంత, పిఇటీలు పాతకోటి మధు,ఆశా, శిరీష,యాకూబ్,శ్రుతి,బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## దాతల సేవలు అభినందనీయం

మోటకొండూరు : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు చేస్తున్న సేవలు అభినందనీయమని మండల విద్యాధికారి కేతిరెడ్డి రఘురాంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చాడ పీఎంశ్రీ ఎంపీపీఎస్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన పబ్బతి శ్రీనివాస్‌రెడ్డి క్రీడా దుస్తులు, పాఠశాలలోని తరగతి గదులకు విద్యుత్ సౌకర్యాన్ని అనంతుల వెంకట్‌రెడ్డి సమకుర్చడం సంతోషకరమన్నారు. ఎస్ఐ డి.అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలగంగాధర్‌రెడ్డి, కృష్ణవేణి, జక్క రోషిరెడ్డి, జక్క యాదిరెడ్డి, నర్సిరెడ్డి, దేవేందర్‌రెడ్డి, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి

మోత్కూరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుల, మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రతి కార్యకర్త పోరాడాలని సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు బొల్లు యాదగిరి పిలుపునిచ్చారు. మంగళవారం జరిగిన సీపీఎం మండల, పట్టణ కమిటీల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కుల, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తోందని ఆయన విమర్శించారు. ఒక వైపు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ముందుకు దూసుకపోతుండగా మరో వైపు యువత కుల, మతాల ఉచ్చులో చిక్కి కొట్టుమిట్టాడుతుందన్నారు.

# పంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలి

ఆత్మకూరు(ఎం) సెప్టెంబర్ 2: (ఆంధ్రజ్యోతి) గ్రామ పంచాయతీ సిబ్బందికి రావాల్సిన బకాయి వేతనాలు చెల్లించాలని సంఘం మండల అధ్యక్షుడు ఇంద్రపెల్లి జ్ఞానేశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీపీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల గ్రామపంచాయతీ సిబ్బంది సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ పంచాయతీ సిబ్బందిని కూడా 2 వ పీఆర్‌సి పరిధిలోకి తీసుకురావాలని, జీవో నెంబర్ 51 ని సవరించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరి లను కొనసాగించాలని కోరాడు. కారోబార్, బిల్ కలెక్టర్‌లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పోలెపాక నర్సింహ్మా, కార్యదర్శి రాగటి శ్రీను, నోముల స్వామి, కె.కిష్టయ్య, కె.లక్ష్మయ్య, రమేష్, లలిత, పద్మ, లక్ష్మీ, పాల్గొన్నారు.





ఆత్మకూరు(ఎం): ధర్నా నిర్వహిస్తున్న పంచాయతీ కార్మికులు

వలిగొండ: ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో జీపీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు కొండే నర్సింహ, జీపీ కార్మికులు ఎల్లమయ్య, రాములు, సత్తయ్య, వెంకటేశం, అంజయ్య, మధు, లలిత, రాములు, మల్లేశం, సాయిలు పాల్గొన్నారు.

# టీఎల్ఎంతో ఉత్తమ బోధన

భూదాన్‌పోచంపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జూలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి టీఎల్ఎం మేళా ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈవో పసునూరి ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎల్ఎంలో తక్కువ ధరతో బోధనోపకరణాలను తయారు చేసి విద్యార్థులకు సులభమైన పద్ధతిలో ఏవిధంగా విద్యార్థులకు బోధించవచ్చునో వివరించారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో జరిగే మేళాకు పోచంపల్లి తరఫున పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో 89మంది ఉపాధ్యాయులు, ఆర్‌పీలు నాగేందర్‌రెడ్డి, బాలబాబు, సునీత, శ్రీధర్, రవిచంద్ర పాల్గొన్నారు.



జూలూరులో ఉత్తమ ప్రతిభను చాటిన వారికి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎంఈవో ప్రభాకర్

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన టీ.ఎల్.ఎం (బోధన అభ్యాసన సామాగ్రి) మేళా ను ఎంపిడివో రాములు మంగళవారం ప్రారంభించాడు. కార్యక్రమంలో ఎంఈవో కె.మహదేవరెడ్డి, హెచ్ఎం లు కే.శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాంరెడ్డి, రత్నమాల, ధనలక్ష్మీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



ఆలేరులో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆలేరు, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌పై సీఎం రేవంత్‌రెడ్డి సాగిస్తున్న కక్షసాధింపు చర్యలను మానుకోవాలని పార్టీ నాయకులు గంగుల శ్రీనివాస్, పుట్ట మల్లేష్, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ బస్సరి శంకరయ్య అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేయడంతో పాటు విచారణను సీబీఐకి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ఆలేరులో నల్లబ్యాడ్జీలతో చేపట్టిన రాస్తారోకోలో వారు మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని తప్పుడు ప్రచారం సాగిస్తూ మాజీ సీఎం కేసీఆర్‌పై కేసులు పెట్టాలని ప్రయత్నించడం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. రాస్తారోకోతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు దారి పొడవున నిలిచిపోయి ట్రాఫిక్ స్తంబించిపోయింది. వెంటనే స్థానిక ఎస్ఐ పోలీసులతో అక్కడికి చేరుకుని రాస్తారోకోను విరమింపజేసి, నిలిచిపోయిన ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి రచ్చ రామనర్సయ్య, మండల నాయకులు తాజా మాజీ ప్రజా ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, ఆరుట్ల లక్ష్మీప్రసాద్‌రెడ్డి, కోటగిరి పాండరి, తమ్మలి ఆశయ్య, నాయకులు సముద్రాల కుమార్, జూకంటి ఉప్పలయ్య, రామకృష్ణ, భరత్, పత్తి వెంకటేష్, పంతం కృష్ణ, రాములు, శోభన్ బాబు, నర్సింహులు, అంజన్‌కుమార్, దయ్యాల సంపత్, చంద్రారెడ్డి, అశోక్, గిరిరాజు వెంకటయ్య పాల్గొన్నారు.

మోటకొండూరు : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేసేందుకు సిద్ధం కావడంతో పోలీసులు అడ్డుకున్నారు. కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పల్లా వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొట్ల యాదయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎగ్గిడి కృష్ణ, నార్మల్ మాజీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, సిరబోయిన నర్సింగ్ యాదవ్, బాల్దలింగం, బీసం కృష్ణంరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.

వలిగొండ: మండల కేంద్రంలో నిర్వహించిన ధర్నాలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు పైళ్ల రాజవర్ధన్‌రెడ్డి, సురకంటి వెంకట్‌రెడ్డి, మొగుళ్ల శ్రీనివాస్, వెంకన్న, జానీ అఫ్రోజ్, రాజు, ప్రభాకర్, పాండారి, మమత, అన్నమేరి, రమేష్ పాల్గొన్నారు.